క్లుప్తంగా

28లోపు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



కొత్తపాలెంలో విశిష్ట సంఖ్యను నమోదు చేస్తున్న ఏఓ భారతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రతి రైతు ఈ నెల 28వ తేదీలోపు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ భారతి తెలిపారు. మంగళవారం ఆమె రైతు గుర్తింపు సంఖ్య నమోదుపై కొత్తపాళెం, పల్లమాల, గాజులపెళ్లూరు, చిన్నయగుంట, వెస్టువరత్తూరు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకుంటే రాయితీలు, రుణాలు, ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు. ఈ నెలాఖరు నాటికి మండలంలోని రైతులందరూ విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాలతో పాటు, మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో నమోదు చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు వెంకటేశ్వర్లు, భాస్కర్, ఏఈఓ రేవతి, వీఏఏ లావణ్య, సత్యవేణి, భారత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్ పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న ఎంఈఓ మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని న్యూట్రిషన్ కిచెన్ గార్డెన్ మంగళవారం ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు రమణయ్య పరిశీలించారు. కిచెన్ గార్డన్‌లో వేసిన గోంగూర, ఆకుకూరలు, బెండ, చిక్కుడు, సొర, బీర, ముల్లంగి తదితర పంటలు బాగుండటంపై సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో కూరగాయలను సాగు చేయటంతో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వాటిని వాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధనంజయులు, సురేంద్రబాబు, కిషోర్, మస్తానయ్య, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కోవూరు ఎమ్మెల్యే



ఆలయం వద్ద ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని మంగళవారం నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఈఓ బాపిరెడ్డి, వేదపండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆమెను ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.


సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకోవచ్చని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం శ్రీశక్తి భవన్‌లో జరిగిన సంఘమిత్రల సమావేశంలో ఎంపీడీఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఒక కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్స్‌కు రూ.60 వేలు మూడు కిలోవాట్స్‌కు రూ.78,600 ఈ పథకంలో సబ్సిడీ ఉంటుందన్నారు. కరెంటు బిల్లులు తగ్గించుకునేందుకు ఇంటి పైకప్పుపై సోలార్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంట ఇంకుడు గుంటలు నిర్మించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఎం డాంగేయాడ్, ఎంఈఓ కే. రవి, సీసీలు శివకుమార్, పళణి, మండల మహిళా సమైఖ్యఅధ్యక్షురాలు కాంచన, అకౌంటెంట్ కోటేశ్వరి, సంఘమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు



గాయపడిన రామచంద్రన్

నాగలాపురం: మండలంలోని వినోభానగర్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొంది. పోలీసుల కథనం మేరకు.. నాగలాపురం తూర్పు దళితవాడకు చెందిన ఎంజీ రామచంద్రన్ (68) తన సొంత పని నిమిత్తం కృష్ణాపురం నుంచి నాగలాపురం బయలుదేరారు. వినోభానగర్ సమీపంలో సత్యవేడు నుంచి పుత్తూరు వెళుతున్న కారు ఎదురుగా వస్తున్న బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో రామచంద్రన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని నాగలాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రేణిగుంట వీధుల్లో ఆర్వో వాటర్ వాహనాలు



పాంచాలి నగర్ వీధిలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ బోర్డ్

జలగలు

- విచ్చలవిడిగా ఆర్వో ప్లాంట్లు
- శుద్ధజలం ముసుగులో జోరుగా నీటి విక్రయాలు
- ప్రజల అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్న ఆర్వో నిర్వాహకులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

కలుషిత నీరు తాగితే వ్యాధుల బారిన పడతామన్న ప్రజల భయాన్ని, అవసరాన్ని ఆసరాగా తీసుకుని కొందరు అక్రమార్కులు శుద్ధజలం ముసుగులో యథేచ్ఛగా నీటి వ్యాపారం చేస్తున్నారు. ఆర్వో ప్లాంట్ల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలు పాటించడం లేదు. ఫలితంగా ప్రజలు డబ్బులిచ్చి, వ్యాధులు కొనుకుంటున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో వారి వ్యాపారం మూడుపువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది.

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): ఆర్వో ప్లాంట్లపై నియంత్రణ, పర్యవేక్షణ లేకపోవడంతో విచ్చలవిడిగా ప్లాంట్లు వీధికొకటి వెలుస్తున్నాయి. వీటిలో నీటిని నిబంధనలకు అనుగుణంగా శుద్ధి చేస్తున్నారా? లేదా అన్నది మాత్రం ప్రశ్నార్థకంగా మిగిలింది. ఆర్వో ప్లాంట్లకు అనుమతులు ఎవరిస్తున్నారు.. పర్యవేక్షణ ఎవరు చేస్తున్నారు అన్న విషయం లేని ప్రశ్నగా మిగిలిపోయింది. మండలంలోని ఏ అధికారిని అడిగిన తమకు సంబంధం ఏమిటి అని దాటవేత ధోరణి అవలంబిస్తున్నారే గాని, సరైన సమాధానం చెప్పే అధికారి కనిపించడం లేదు.

లెక్కకు మించి ప్లాంట్లు

రేణిగుంట మండలంలో అధికారుల లెక్క ప్రకారం ప్రభుత్వ ఆర్వో ప్లాంట్లు 15 ఉండగా, ప్రైవేట్ వాటర్ ప్లాంట్లు 42 ఉన్నాయని చెబుతున్నారు. కానీ వాస్తవంగా లెక్కకు మించి వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆర్వో ప్లాంట్లను పర్యవేక్షించాలని మండల స్థాయి అధికారులు చెబుతున్నారు. కానీ ఫుడ్ సేఫ్టీ అధికారులు వాటర్ ప్లాంట్ల తనిఖీలు చేస్తున్న దాఖలాలు లేవు. ప్రతి ఆర్వో ప్లాంట్ వద్ద టైం స్కేల్ అందరికీ తెలిసేలా ఏర్పాటు చేయాలని నిబంధనలు ఉన్నా, వాటిని అమలుచేసే ఆర్వో ప్లాంట్లు కనిపించడం లేదు, ఆర్వో ప్లాంట్ స్థాయిని ఆధారంగా 30 రోజులు నుంచి 45 రోజుల లోపు ఒకసారి ఫిల్టర్లు మార్చాలని నిబంధనలు చెబుతున్నా డబ్బులకు కక్కుర్తి పడుతున్న వాటర్ ప్లాంట్ నిర్వాహకులు వాటిని సకాలంలో మార్చకపోవడంతో డబ్బులు ఇచ్చి రోగాన్ని కొనుక్కొని తాగుతున్నామనే భయాందోళన ప్రజలలో నెలకొని ఉంది. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన తాగునీటి విషయంలో సంబంధిత అధికారులు కఠినంగా వ్యవహరించి సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అదేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పెరగనున్న శుద్ధి నీటి వాడకం

వేసవి మొదలవుతున్న తరుణంలో మినరల్ వాటర్ వాడకం కూడా గణనీయంగా పెరుగుతోంది. రేణిగుంట మండలంలో 19,339 కుటుంబాలకు గాను 75,789 మంది జనాభా ఉన్నారు. 70 శాతం కుటుంబాలు క్యాన్ వాటర్ తాగేందుకు అలవాటు పడిపోయారు. సగటున ఒక కుటుంబానికి రోజుకి ఒక క్యాన్ వాడిన సుమారు 15 వేల క్యాన్లు వాటర్ వాడకం జరుగుతుంది.

ఉపాధి యూనిట్ల మంజూరుకు ఇంటర్వ్యూలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో స్వయం ఉపాధి పథకాల రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం ఉదయం 9 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ హాల్ బ్యాంకు సిబ్బంది సమక్షంలో ముఖాముఖి ఇంటార్వ్యూలు జరుగుతాయని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. అభ్యర్థులందరూ ఆన్‌లైన్ అప్లికేషన్, ఒరిజినల్ కుల ధ్రువీకరణ పత్రం, రేషన్, ఆధార్ కార్డ్, పాసుబుక్, తీసుకురావాలని తెలిపారు.

నేడు వాహనం వేలం

శ్రీకాళహస్తి: స్థానిక ఎక్సైజ్‌శాఖ పరిధిలో బుధవారం వాహనాన్ని వేలం వేయనున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నేరాల్లో పట్టుబడిన హుండ్యాయ్ సాంత్రో కారు బుధవారం ఉదయం 11గంటలకు తిరుపతి ఎక్సైజ్, ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వేలం వేయనున్నట్లు తెలిపారు. పాల్గొనదలచిన వారు దరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థి ఎంపిక



వై మునిరత్నం

సత్యవేడు: మండలంలోని ఇరుగుళం జెడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి వై.మునిరత్నం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మెహిద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థికి రూ.12 వేలు చొప్పులు ఇంటర్ వరకు స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. ఉపాధ్యాయులు కే. మధు, నీలకంఠం, జయచంద్ర, గిరి, చెంచురెడ్డి, మధుబాబు విద్యార్థిని అభినందించారు.

తెలుగు భాషను ప్రేమిద్దాం



భాషోత్సవాల్లో పాల్గొన్న హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు

సత్యవేడు: తెలుగు భాషను ప్రేమిద్దాం.. పరభాషలను గౌరవిద్దామని హెచ్‌ఎం భారతి అన్నారు. సోమవారం బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా జరిగాయి. తొలుత ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి సరస్వతీ దేవి, తెలుగుతల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమ్మనైన తెలుగు భాషను కలలోనైనా మరువద్దు అని సూచించారు. భాషోత్సవాల్లో భాగంగా తొలిరోజు ఆంగ్ల భాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఇంగ్లీషు ఉపాధ్యాయులు వైవీఎల్ కుమార్, ఏటీ సురేఖ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనోహరుడు, సుబ్బారాయడు, కార్తిక్ కుమార్, వి. శ్రీదేవి, మురళి పాల్గొన్నారు.

వైద్య సేవలపై సమీక్ష



గూగుల్‌మీట్ సమీక్షలో వైద్య సిబ్బంది

నారాయణవనం: మండలంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు వైద్య సేవలపై న్యూఢిల్లీ నుంచి కేంద్ర అధికారులు గూగుల్‌మీట్ ద్వారా మంగళవారం సమీక్షించారని మండల వైద్యాధికారి డాక్టర్ దర్శిత్‌రాజ్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్(ఏఏఎం) అమలు తీరుపై న్యూఢిల్లీ నుంచి నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్యూఏఎస్) అధికారులు మండలంలోని వీకే పాళ్యం విలేజ్ క్లినిక్ వైద్య సిబ్బంతో గూగుల్ మీట్ ద్వారా ముఖాముఖి మాట్లాడి నివేదికలను పరిశీలించి, సమీక్షించినట్లు తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ఏఎస్‌ఎం పరిమళ, ఆశవర్కర్లు శైలజ, చంద్రకళ, లక్ష్మి గూగుల్‌మీట్‌లో పాల్గొన్నారన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో ప్రజలకు అందిస్తున్న సేవలను ముఖ్యంగా గర్భిణులకు వేస్తున్న టీకాలు, ఐరన్, ఫోలిక్ మాత్రలు, బి కాంప్లెక్స్ క్యాల్షియం మాత్రల గురించి అడిగి తెలుసుకున్నారన్నారు. పిల్లల టీకాలు, వంశపార్యంపర్య రోగాలు, వృద్ధులకు నిర్వహిస్తున్న బీపీ, షుగర్ పరీక్షలు, నమూన సేకరణ, వ్యాధి నిర్ధారణ, అందిస్తున్న మందుల వివరాలపై సమీక్షించి, ఆన్‌లైన్‌లో రికార్డులను పరిశీలించారని అన్నారు. కుటుంబ నియంత్రణ, ఆసుపత్రిల్లో జరుగుతున్న కాన్పులపై సమీక్షించారని అన్నారు. వైద్య సేవలను మెరుగుపరుచుకుంటూ, అందరికీ అందివ్వడానికి కృషి చేయాలని సిబ్బందికి సూచన చేశారని దర్శిత్‌రాజ్ తెలిపారు. వీరితో పాటు జిల్లా టీమ్ సభ్యులు హరికృష్ణ, దర్శత్‌రాజ్, హెల్త్ సూపర్‌వైజర్లు వరలక్ష్మి, యశోద, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.


శిథిలావస్థలో సంరక్షణ భవనం



పాడుబడిన సంరక్షణ కేంద్రం భవనం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పార్లపల్లిలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, కోసం ఏర్పాటు చేసిన సంరక్షణ కేంద్ర భవనం నిరుపయోగంగా ఉండి, శిథిలావస్థకు చేరుకుంది. దీంతో బాలింతలు, గర్భిణులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. భవనానికి మరమ్మతులు చేయాలని, పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైన సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించిన సంరక్షణ భవనానికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎర్రమట్టినీ తోడేస్తున్నారు



ట్రాక్టర్‌లో మట్టిని నింపుతున్న హిటాచీ

నారాయణవనం: తమ ప్రమేయం లేకుండా మట్టిని అక్రమార్కులు జేసీబీలతో తోడేస్తున్నారని, అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే దౌర్జన్యం చేస్తున్నారుని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ సెలవు దినాల్లో, అర్ధరాత్రుల్లో కొండలు, గుట్టలు, పొలాల్లో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టిని ఇష్టారాజ్యంగా తవ్వి విక్రయిస్తున్నారన్నారు. తమ పొలాలలో పది అడుగుల లోతుకు తవ్వేస్తున్నారని బాధిత రైతులు వాపోతున్నారు. గ్రామ సేవకులకు సమాచారం తెలిసినా.. మనకెందుకులే అంటూ పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడం లేదు. మండలంలోని కసిమిట్ట, భీమునిచెరువు, బొప్పరాజుపాళ్యం పంచాయతీల పరిధిలో అడవులకు సమీపంలోని పొలాల్లో నాణ్యమైన ఎర్రమట్టిని వారం రోజులుగా జేసీబీ, హిటాచీలతో తవ్వి, మూతపడిన కందేరీ జ్యూస్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పొలం రైతు కాంతమ్మ కుటుంబ సభ్యులు ట్రాక్టర్లను అడ్డుకున్నా ఫలితం లేకపోయింది. ట్రాక్టర్ డ్రైవర్లు దౌర్జన్యంతో తమ వాహనాలను తీసుకువెళ్లిపోయారని కాంతమ్మ కుమారులు వాపోయారు. పగటి పూటే మట్టిని తరలిస్తున్నా పట్టించుకునే వారు లేకపోవడం గమనార్హం.

సన్నిధివీధిలో తప్పని ట్రాఫిక్ తిప్పలు



సన్నిధివీధిలో నిలబడినవాహనాలు



నోపార్కింగ్‌వద్ద నిలబెట్టిన వాహనాలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని సన్నిధి వీధిలో ఆక్రమణలు తొలగించి రోడ్డు వెడల్పు చేసినప్పటికీ ట్రాఫిక్ కష్టాలు తొలగడం లేదు. గాలిగోపురం వద్ద, జలవినాయకుని దాటిన తరువాత విస్తరించిన రోడ్డులో లాడ్జీల్లో గదులు తీసుకున్న వారు కార్లను రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. దీంతో సన్నిధివీధిలో ట్రాఫిక్ కష్టాలు తీరడంలేదు. నోపార్కింగ్ బోర్డు ఉన్నప్పటికీ పక్కనే వాహనాలను పార్కింగ్ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ సెక్యూరిటీ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు ఏమయ్యారని అనుకుంటున్నారు. ఆర్టీసీ బస్సు కూడా రామాలయం ఆపడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఈ రోడ్లను వెడల్పు చేసి రూ.27లక్షలతో నిర్మించిన గోడను కొట్టి మరో రూ.30 లక్షలతో గోడను నిర్మించి కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ఆలయాధికారుల తీరు ఉందని పలువురు విమర్శిస్తున్నారు. రోడ్డువెడల్పు చేసింది వాహనాలు పార్కింగ్‌చేయడానికా అని భక్తులు విస్తుపోతున్నారు.

పొగాకు వినియోగంతో క్యాన్సర్ ముప్పు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

శ్రీకాళహస్తి: పొగాకు ఉత్పత్తులు వినియోగించేవారికి నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ ముప్పు పొంచి ఉందని, ఆ అలవాట్లను మానుకోవాలని తొట్టంబేడు వైద్యాధికారి డాక్టర్ లహరి అన్నారు. స్విమ్స్ ఆధ్వర్యంలో మంగళవారం తొట్టంబేడు పీహెచ్‌సీ పరిధిలో చిట్టత్తూరు, శివనాథపాళెంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలతో పాటు మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 20న కంచనపల్లి, 22న ఇలగనూరు, గుండేలిగుంట, 24న పెద్దకనపర్తి, పూడిలో వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్యులు చైతన్య బాను, సర్పంచులు కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శులు శాంతి, రోజా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈఓ మునిసుబ్రమణ్యం



మాట్లాడుతున్న ఎంఈఓ రవి

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి, పీపీ–1, పీపీ–2పై శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం ప్రారంభించారు. ఆరు రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు విద్యార్థుల బోధనా పద్ధతులపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వనున్నట్లు డీఆర్పీలు పవిత్ర, రమేష్, శివశంకర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, సూపర్‌వైజర్ యమున, పాల్గొన్నారు.

ఆటపాటలతో బోధించాలి

సత్యవేడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లలకు ఆటపాటలతో బోధించాలని ఎంఈఓ రవి కోరారు. సోమవారం అంగన్‌వాడీ కార్యర్తలకు జ్ఞానజ్యోతి 120 దినాలపై అంగన్‌వాడీ ప్రాథమిక పాఠశాల, అభ్యసనాభివృద్ధిపై ఆరు రోజు శిక్షణ తరగతులు బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఆరేళ్ల కంటే తక్కువ ఉన్న పిల్లలకు బాల్య సంరక్షణ, విద్య, పోషకాహార సేవలను మరింత బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. డీఆర్పీలు బాలకృష్ణ, జయమణి, గుణశేఖర్ సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మెషన్‌పై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ–2 ఉషా, ప్రధానోపాధ్యాయులు కే. భారతి, సూపర్ వైజర్లు ఎస్ భజావతి, జ్యోతి, ఎంఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

హోర్డింగ్‌ల తయారీకి ఆహ్వానం

తిరుపతి అర్బన్ : మహిళా శిశు సంక్షేమ శాఖ హోర్డింగ్‌ల తయారీకి కంపెనీలు, ఏజెన్సీలను ఆహ్వానిస్తున్నట్లు జేసీ శుభం బన్సల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈ నెల 21 వ తేదీ లోపు సంప్రదించాలని సూచించారు.

నేడు వైఎస్సార్‌సీపీ నగర కమిటీ ప్రమాణస్వీకారం

తిరుపతి మంగళం : పాత తిరుచానూరు రోడ్డులోని ఎస్‌ఆర్ కల్యాణమండపంలో వైఎస్సార్‌సీపీ నగర కమిటీ బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడిగా మల్లం రవిచంద్రా రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష హాజరుకానున్న కార్యక్రమానికి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పశువులకు రేడియం నెక్ బెల్టులు



పశువులకు రేడియం స్టికర్ కడుతున్న నిరీషా రెడ్డి

శ్రీసిటీ(సత్యవేడు): జాతీయ భద్రతా మాసోత్సవంలో భాగంగా రోడ్డు ప్రమాదాలు నివారించడానికి , రోడ్డుపై సంచరించే పశువులను రక్షించడానికి శ్రీసిటీలోని అకార్డ్ స్కూల్‌ల్లో వినూత్న ప్రచార కార్యక్రమం చేపట్టింది. శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్‌ఆర్) నిరీషా రెడ్డి , అకార్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ బృందం కలసి పశువుకు రేడియం నెక్ స్టిక్లర్లు కట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేడియం రిఫ్లెక్టివ్ కాలర్ బెల్టుల విధానం ఇటు పశువులకు, అటు వాహనచోదకుల భద్రతకు ఎంతగానో ఉపయోగకరమని పేర్కొన్నారు. రోడ్లపై పశువులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పశువుల యజమానులకు అవగాహన కల్పించారు. 150 పశువులకు రేడియం బెల్టు స్టిక్కర్లు కట్టారు. విద్యార్థులు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాళహస్తి – సత్యవేడు :
90100 03139